సాక్షి
విశాఖపట్నం
బుధవారం। 31। మే। 2023



ఆహా.. 'అరకు కాఫీ'

అరకు కాఫీకి అంతర్జాతీయంగా క్రేజ్ పెరుగుతోంది. సేంద్రియ పద్ధతుల్లో సాగుచేస్తున్న కాఫీకి విదేశీయులు ఫిదా అవుతున్నారు. 10లో



ముగిసిన వేసవి శిబిరాలు

ఈకోర్సావాల్తేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు మంగళవారంతో ముగిశాయి. 10లో



రజనీష్ బాధ్యతల స్వీకరణ

నేవల్ ఆఫీసర్ ఇన్‌చార్జ్ (ఆంధ్రప్రదేశ్)గా కమడోర్ రజనీష్ శర్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. 10లో

న్యూస్‌రీల్

లలితాపీఠంలో కుర్తాళం పీఠాధిపతి



శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: కుర్తాళం పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి నాలుగు నెలల తర్వాత అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితపీఠానికి విచ్చేశారు. శోభాకృత్ నామ సంవత్సరం ఆషాఢ పూర్ణిమ జూలై 3 తేదీ నుంచి భాద్రపద పూర్ణిమ సెప్టెంబరు 29 వరకు లలితాపీఠంలో 'చాతుర్మాస దీక్ష' జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవకృష్ణసేన్ తెలిపారు. అప్పటి వరకు పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి లలితాపీఠంలో ఉంటారని తెలిపారు. స్వామిని కలవడానికి ముందుగా అనుమతి కోసం 98492 86779ను సంప్రదించాలని తెలిపారు.

మూడో విడత చందనం అరగదీత ప్రారంభం



చందనాన్ని అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం నుంచి మూడో విడత చందనం అరగదీత శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. వచ్చే నెల 4న జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామికి సమర్పించే మూడు మణుగుల పచ్చి చందనాన్ని(120 కిలోలు) సమకూర్చేందుకు ఈ అరగదీతను ప్రారంభించారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం వరకు సిబ్బంది 34 కిలోల చందనాన్ని అరగదీశారు. ఇంకా 86 కిలోల చందనం అవసరం కాగా మరో మూడు రోజులపాటు అరగదీత జరగనుంది.

జపనీస్ లాంగ్వేజ్‌లో సర్టిఫికెట్ కోర్సుకు కృషి



వీసీ ప్రసాదరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీఎం బాలాజీ, ఆచార్య జగన్నాథరావు

ఎంవీపీకాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం ద్వారా అందిస్తున్న జపనీస్ లాంగ్వేజ్ కోర్సును బలోపేతం చేయడంతో పాటు సర్టిఫికెట్ కోర్సును సైతం అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య ఎం.జగన్నాథరావు సమక్షంలో జపాన్‌కు చెందిన తోషిబా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ పీఎం బాలాజీ మంగళవారం ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో మర్యాద పూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీ అందిస్తున్న జపనీస్ లాంగ్వేజ్ కోర్సు బలోపేతం దిశగా చర్చలు జరిగాయి. జపనీస్ లాంగ్వేజ్ శిక్షణకు సర్టిఫికెట్ కోర్సు నిర్వహించే దిశగా సహకారం అందించాలని పీఎం బాలాజీని వీసీ కోరారు. వీసీ ప్రసాదరెడ్డి ప్రతిపాదనకు పీఎం బాలాజీ సమ్మతి తెలపడంతో పాటు అందుకు అవసరమైన ప్రణాళికకు కృషి చేస్తామని వెల్లడించారు.

52 వాహనాలపై కేసులు



తనిఖీలు చేస్తున్న రవాణాశాఖ అధికారులు

గోపాలపట్నం: మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా పొల్యూషన్ సర్టిఫికెట్లు లేని వాహనాలపై రవాణా శాఖ అధికారులు మంగళవారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఎన్‌ఏడీ, మద్దిలపాలెం జంక్షన్లలో చేపట్టిన తనిఖీల్లో 52 వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఓ వాహనాన్ని సీజ్ చేసినట్టు ఉప రవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు. తనిఖీల్లో ఆర్టీవో ఐ.వేణుగోపాలరావు, ఎంవీఐలు ఎం.బుచ్చిరాజు, బి.బాలాజీరావు, రోఫి మున్నీషా, కె.శ్రీనివాస్, సత్యం నాయుడు, ఏఎంవీఐలు పి.శిరీష, మాధవి పాల్గొన్నారు.

రైల్వే సీనియర్ క్లర్క్ డిస్మిస్

తాటిచెట్లపాలెం: వాల్తేరు డివిజన్ పరిధి లక్ష్మీపూర్ రోడ్డు స్టేషన్‌లో సీనియర్ క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్న సంపత్తి రామచంద్రరావును విధులు నుంచి తొలగించినట్టు డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి తెలిపారు. 1997లో కలాసిగా విధుల్లో చేరిన రామచంద్రరావు సీనియర్ క్లర్క్‌గా ఎదిగారన్నారు. రైల్వే అధికారులపై తప్పుడు కేసులు పెట్టడం, సిబ్బందిని తప్పుతోవ పట్టించడం, అధికారులను బ్లాక్ మెయిల్ చేస్తూ ఉండేవాడన్నారు. అవన్నీ రుజువు కావడంతో ఆయనను విధులు నుంచి తొలగించామన్నారు.

జనమే సాక్షిగా.. నాలుగేళ్ల వేడుక

వాడవాడలా సేవాకార్యక్రమాలు

సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించి మంగళవారం నాటికి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. జిల్లాల్లో పలు నియోజకవర్గాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఉప్పొంగిన ఉత్సాహంతో ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు.



ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. 45వ వార్డు ఏఎస్సార్ నగర్‌లో కార్పొరేటర్ కంపా హనోక్ ఆధ్వర్యంలో కె.కె.రాజు పేదలకు చీరలు పంపిణీ చేశారు.



దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో అంబికాబాగ్ రామాలయంలోని కల్యాణమండపంలో కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. అనంతరం దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, కార్పొరేషన్ చైర్మన్లు కోలా గురువులు, జాన్ వెస్లీ, వి.మధుసూదనరావు పాల్గొన్నారు.



భీమిలిలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేక్ చేసి సంబరాలు చేశారు. అనంతరం ఆనందపురం నుంచి తగరపువలస వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.



గాజువాకలోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆధ్వర్యంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. నియోజకవర్గ పరిశీలకుడు బొడ్డేడ ప్రసాద్ పాల్గొన్నారు.



పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు ఆధ్వర్యంలో వేపగుంట జంక్షన్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి..అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం వేపగుంట నుంచి పెందుర్తి వరకు బైక్ ర్యాలీ చేశారు.

దేశానికే ఆదర్శం.. సీఎం జగన్ పాలన

- వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో నాలుగేళ్ల సంబరాలు
- కేక్ కట్‌చేసి పేదలకు చీరల పంపిణీ



పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ నాయకులు

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ నాలుగేళ్ల పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు కొనియాడారు. ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టి నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా మంగళవారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. ముందుగా బి.ఆర్.అంబేడ్కర్, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పంచకర్ల రమేష్‌బాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. బాణసంచా కాల్చి వేడుకలు చేసుకున్నారు. మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణితో కలిసి ఆయన పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీల్లో 98.5 శాతం వరకు నాలుగేళ్ల పాలనలో నెరవేర్చారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి రావడం తథ్యమని పేర్కొన్నారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం తీసుకొచ్చారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయంలో పలు సంస్కరణలు చేపట్టారన్నారు. కార్పొరేషన్ చైర్మన్లు కోలా గురువులు, జాన్‌వెస్లీ, మధుసూదనరావు, కార్పొరేటర్లు అల్లు శంకర్‌రావు, రెయ్యి వెంకటరమణ, అనిల్‌కుమార్ రాజు, పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి రవిరెడ్డి, ముఖ్యనాయకులు శ్రీకాంత్ రాజు, ఫరూఖీ, ఆల్ఫా కృష్ణ, సతీష్‌చంద్ర, పేర్ల విజయచందర్, పేడాడ రమణకుమారి, యువశ్రీ, రీజనల్, జిల్లా విభాగం ఇన్‌చార్జిలు అల్లంపల్లి రాజబాబు, పీలా వెంకటలక్ష్మి, బి.పద్మావతి, జానీ, అద్దాల కృపాజ్యోతి, మన్యాల శ్రీనివాస్, బొండా ఉమామహేశ్వరరావు, అప్పన్న , నమ్మి లక్ష్మణ్, ప్రేమ్ బాబు, బాబా పాల్గొన్నారు.

నిరుద్యోగులకు టోకరా

- ప్రభుత్వ కార్యాలయాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలంటూ మోసం
- పలువురు నుంచి లక్షలాది రూపాయలు వసూలు
- ద్వారకానగర్ పోలీస్‌స్టేషన్ వద్ద నిరుద్యోగుల నిరసన



ద్వారకా పోలీస్‌స్టేషన్ వద్ద నిరుద్యోగులు

సీతమ్మధార : ప్రభుత్వ కార్యాలయాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలంటూ జావా మాటిక్ ఐటీ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిరుద్యోగులను నిండా ముంచింది. వందలాది మంది నుంచి లక్షలాది రూపాయలు వసూలుచేసి నకిలీ ఆర్డర్లు ఇచ్చి రోడ్డున పడేసింది. మోసపోయామని గ్రహించిన బాధితులు మంగళవారం ద్వారకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుమారు 60 మంది వరకు నిరుద్యోగులు నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లతో స్టేషన్‌కు వచ్చి తమ గోడును వెల్లడించారు. ఈ సంస్థ కొన్నాళ్ల క్రితం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాతోపాటు తాడేపల్లిగూడెంలో పలు ప్రాంతాల్లో బ్రాంచ్‌లు ఏర్పాటుచేసి, రిజిస్టార్ కార్యాలయాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు, సాల్ట్ ప్రోగ్రామ్ కింద అంగన్‌వాడీ కేంద్రాల్లో శిక్షణ వంటి ఉద్యోగాలు ఇస్తామని ప్రచారం చేసిందని తెలిపారు. ఇది నమ్మి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 15 వందల మంది వరకు రూ.2 లక్షల నుంచి రూ.6 లక్షలు చొప్పున కట్టారని చెప్పారు. 2022 ఆగస్టు నుంచి సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో పనిచేసిన తమకు జీతాలు ఇవ్వలేదని పలువురు తెలిపారు. జీతాలు అడిగితే నచ్చినవారికి చెప్పుకోవాలని సమాధానం ఇచ్చారని వాపోయారు. తాము పనిచేసిన కాలానికి జీతాలు, తాము కట్టిన డబ్బులు తిరిగి ఇప్పించాలని కోరారు. మరికొందరికి నకిలీ ఆర్డర్లు ఇచ్చి నిలువునా ముంచేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ సంస్థకు బ్రాంచ్‌లు ఉన్నాయని, తాము పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వస్తున్నామని తెలిసి ఎన్‌ఏడీ వద్ద గల బ్రాంచ్ మూసివేశారన్నారు. విశాఖలోనే సుమారు 200 మంది బాధితులు ఉన్నాయని పేర్కొన్నారు.

ఉచిత సీటు ఇవ్వకుంటే గుర్తింపు రద్దు చేస్తాం

- 'సాక్షి'తో విద్యాశాఖ ఆర్జేడీ జ్యోతికుమారి

విశాఖ విద్య: ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యకు ఎంపికైన విద్యార్థులకు అడ్మిషన్ ఇవ్వని పాఠశాలల గుర్తింపు రద్దు చేస్తామని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఎం.జ్యోతికుమారి హెచ్చరించారు. 'ప్రైవేటులో ఉచిత సీట్లకు తూట్లు' అనే శీర్షికన మంగళవారం 'సాక్షి' లో ప్రచురితమైన కథనంపై ఆర్జేడీ జ్యోతి కుమారి స్పందించారు. ప్రైవేటు/కార్పొరేట్ స్కూళ్లలో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు కచ్చితంగా పేదలకు ఇవ్వాల్సిందేనని అన్నారు. ఉచిత విద్య సీటు పొందిన విద్యార్థుల సమగ్ర వివరాలను అందించాలని జోన్ పరిధిలోని అన్ని జిల్లాల డీఈవోలను ఆదేశించామని తెలిపారు. పాఠశాలల వారీగా సీటు పొందిన విద్యార్థుల్లో చేరని వారు ఉంటే, అందుకు గల కారణాలేంటనే దానిపై వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. ఎంఈవో, డిప్యూటీ డీఈవోలు దీనిపై పర్యవేక్షణ చేయాలని తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు ఆర్ఐవో పి.ఉమారాణి తెలిపారు. మంగళవారం ఉదయం మొదటి సంవత్సరం పరీక్షకు 23,833 మందికి 22,049 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. 92.51 శాతం నమోదైనట్లు వెల్లడించారు. మధ్యాహ్నం జరిగిన రెండో సంవత్సరం పరీక్షకు 6,734 మందికి గానూ 6,074 మంది విద్యార్థులు హాజరు కాగా.. 90.2 శాతం నమోదైందని తెలిపారు. మరో రెండు రోజుల్లో పరీక్షలు ముగుస్తాయని, పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి తప్పిదాలకు చోటు లేకుండా చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులకు బాధ్యతలు అప్పగించామన్నారు. ప్రత్యేక స్క్వాడ్ బృందాలు కేంద్రాలను తనిఖీలు చేస్తున్నాయన్నారు.

రైతు భరోసా కింద రూ.20.97 కోట్ల మంజూరు

పద్మనాభం: వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం కింద 5వ ఏడాది మొదట విడతగా 27,955 మంది రైతులకు రూ.20.97 కోట్లు మంజూరైనట్టు భీమునిపట్నం సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయప్రసాద్ తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయానికి పెట్టుబడి సహాయంగా ప్రభుత్వం ఐదో సంవత్సరం ఈ నిధులు అందిస్తుందని చెప్పారు. మండలంలోని పాండ్రంగిలో జూన్ ఒకటో తేదీన రైతు భరోసా–పీఎం కిసాన్ పంపిణీ జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పద్మనాభం, ఆనందపురం, భీమిలి, పెందుర్తి, గాజువాక, చినగదిలి, పెద గంట్యాడ మండలాలకు చెందిన రైతులు, కౌలు రైతులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

పాక్ జైలులో నరకయాతన

- సీఎం జగన్ చొరవతో విముక్తి పొందాం
- ఇది మాకు పునర్జన్మే: మత్స్యకారులు



విశాఖ చేరుకున్న మత్స్యకారులు

మహారాణిపేట: 'పాకిస్తాన్ జైలులో ఐదేళ్ల పాటు నరకయాతన అనుభవించాం. ఇంటికి చేరుతామన్న నమ్మకం లేదు. ఇది మాకు పునర్జన్మే..'అని పాక్ బాధిత మత్స్యకారులు వాపోయారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చొరవతో తమ కుటుంబ సభ్యులను చూడగలుగుతున్నామని ఆనందం వ్యక్తం చేశారు. బతుకుదెరువు కోసం రాష్ట్రానికి చెందిన మత్స్యకారులు.. గుజరాత్ వలస వెళ్లి చేపల వేట చేస్తుండగా పాకిస్తాన్ కోస్ట్‌గార్డు చేతికి చిక్కారు. ఐదేళ్ల పాటు అక్కడ నరకయాతన అనుభవించిన ముగ్గురు మత్స్యకారులు మంగళవారం విశాఖ చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి పరిస్థితులను వివరిస్తూ కన్నీటిపర్యంతమయ్యారు.

సరైన భోజనం లేదు



పాకిస్తాన్ జైలులో ఐదేళ్ల పాటు నరకం చూశాం. సరైన భోజనం కూడా పెట్టలేదు. బతకడం కోసం వారి పెట్టింది తిన్నాం. నా తండ్రి చనిపోయి రెండేళ్లు అవుతోంది. ఆ విషయం కూడా ఇప్పుడే తెలిసింది. తండ్రి కడసారి చూపు చూడలేకపోయాను. చాలా బాధగా ఉంది.

– మైలపల్లి భాస్కరరావు, కొయ్యాం, ఎచ్చెర్ల మండలం, శ్రీకాకుళం జిల్లా

చచ్చి బతికాను



నా వయసు 60 ఏళ్లు. తరచూ అనారోగ్యానికి గురయ్యేవాడిని. అక్కడ జైలులో ఎలాంటి సదుపాయాలు లేవు. జబ్బు పడితే పట్టించుకునే నాథుడే లేడు. భాస్కరరావు నన్ను వైద్యులకు చూపించేవాడు. సహచర మత్స్యకారులు లేకపోతే ఎప్పుడో చనిపోయేవాడిని. పగవాడికి కూడా ఇలాంటి కష్టం రాకూడదు.

– మాదే అన్నవరం, గజ్జికాయలపురం, కాట్రేంకోన మండలం, తూర్పుగోదావరి జిల్లా

దేవుడి దయతో బతికి బయటపడ్డా..



చదువుకోకపోవడం వల్ల ఎన్నో ఇబ్బందులు పడ్డాను. పాక్‌లో అక్కడి జైలు సిబ్బంది మాట్లాడే భాష అర్థమయ్యేది కాదు. జైలులో నా ముందే వారు ఏదో మాట్లాడుకునేవారు. వచ్చీరాని హిందీతో ఐదేళ్లు గడిచిపోయింది. దేవుడి దయతో బతికి బయటపడ్డా.

– పెమ్మిడి నారాయణరావు, పసువులంక, ఐ.పోలవరం, తూర్పుగోదావరి జిల్లా

పథకం ప్రకారమే ప్రాణం తీశాడు

- విడిపోయినా భార్యకు వేధింపులు
- నెల రోజులుగా మంచివాడిగా నటన
- లాడ్జికి రప్పించి దారుణ హత్య




మహాలక్ష్మి (ఫైల్), శ్రీనివాస్



కేజీహెచ్ వద్ద ఆందోళన చేస్తున్న మహాలక్ష్మి బంధువులు

సాక్షి, అనకాపల్లి/అచ్యుతాపురం: ఇంటర్ నుంచి ప్రేమించాడు. పెద్దల్ని ఎదిరించి పెళ్లి చేసుకున్నాడు. చివరకు పెద్దలు కూడా ఆదరించడంతో హాయిగా కాపురం చేసుకోవలసిన స్థితిలో భార్యతో విభేదాలు వచ్చాయి. విడిపోవాలని నిర్ణయించుకున్న తర్వాత కూడా ఆమెను విడిచిపెట్టలేదు. వెంటపడి వేధించడంతో పోలీసుల వరకు వ్యవహారం వెళ్లింది. ఫిర్యాదు చేసిందని కోపం పెంచుకున్నాడు. కక్ష కట్టి హత్యకు ఒడిగట్టాడు. సంఘటన స్థలంలో కనిపించిన దృశ్యాలు, పోలీసుల దర్యాప్తులో తెలిసిన విషయాల వల్ల దాదాపు ఇదే విషయం నిర్ధారణ అవుతోంది. అచ్యుతాపురంలో సోమవారం జరిగిన మహిళ అనుమానాస్పద మృతి హత్యగానే పోలీసులు భావిస్తున్నారు.

ఇంటర్ నుంచే పరిచయం

ఇన్వెస్టిగేషన్ అధికారి, పరవాడ డీఎస్పీ కె.వి.వి సత్యనారాయణ చెప్పిన వివరాల ప్రకారం... అగనంపూడికి చెందిన మహాలక్ష్మి, గాజువాక బీసీ సెంటర్‌కు చెందిన శ్రీనివాస్‌లు ఇద్దరూ ఇంటర్ నుంచే క్లాస్‌మేట్స్. వీరి స్నేహం ప్రేమగా మారింది. పెద్దలను ఎదురించి పెళ్లి చేసుకున్నారు. వివాహమైన ఏడాదిలోనే వీరిద్దరి మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. ఈ విభేదాలు కాస్త విడాకుల వరకూ దారితీశాయి. చివరికీ ఇద్దరూ మ్యూచువల్ డైవోర్స్‌కి సిద్ధపడ్డారు. 2021లో విడాకులకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే శ్రీనివాస్ కోర్టుకు సక్రమంగా హాజరయ్యేవాడు కాదు. దీంతో విడాకుల ప్రక్రియ ఆలస్యమైంది. అగనంపూడి నుంచి రాంబిల్లికి రోజూ బస్సులో ఉద్యోగానికి వెళుతున్న మహాలక్ష్మి సంతోషంగా ఉండడం ఇష్టం లేని శ్రీనివాస్ మద్యానికి బానిసయ్యా డు. ఏ ఉద్యోగం లేకుండా జులాయిగా తిరిగే ఉన్మాదిలా మారాడు. మహాలక్ష్మిని వేధించడం మొదలపెట్టాడు. దీంతో ఆమె తల్లిదండ్రులు గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేయడం..వారు కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగింది. దీంతో మహాలక్ష్మిపై పగ పెంచుకున్నాడు. ఎలా అయినా హతమార్చాలని అనుకున్నాడు.

మహాలక్ష్మి ఒంటిపై 20 కత్తి గాట్లు

నెల రోజుల నుంచి శ్రీనివాస్ మంచివాడిగా మారినట్లు నటించాడు. ఆ అమ్మాయికి తనపై సానుభూతి కల్గించేలా చేశాడు. పథకం ప్రకారమే సోమవారం ఉదయం 10.30 గంటలకు అచ్యుతాపురంలోని లాడ్జిలో తన పేరు మీద రూం బుక్ చేసుకున్నాడు. తనతోపాటు బిర్యానీ, మత్తు ఇంజక్షన్‌లు, కత్తి కూడా తీసుకుని వచ్చాడు. లాడ్జి నుంచే మహాలక్ష్మికి ఫోన్ చేశాడు. రమ్మని ప్రాధేయపడ్డాడు. దీంతో ఉదయం 11 గంటలకు ఆమె లాడ్జికి వచ్చింది. ఆ తర్వాతే దారుణం జరిగింది. మహాలక్ష్మి శరీరంపై 20 వరకు కత్తి గాట్లు ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు.

ఇంకా అపస్మారక స్థితిలోనే శ్రీనివాస్

మత్తు ఇంజక్షన్‌లు తీసుకోవడంతో మంగళవారం కూడా శ్రీనివాస్ అపస్మారక స్థితిలోనే ఉన్నాడు. అనకాపల్లిలో చికిత్స పొందుతున్నాడు.

మహాలక్ష్మి బంధువుల ఆందోళన

మహారాణిపేట: మహాలక్ష్మి బంధువులు మంగళవారం కేజీహెచ్‌లో ఆందోళన చేశారు. మహాలక్ష్మి భర్త శ్రీనివాస్‌పై కేసు నమోదు చేయాలని, కఠినంగా శిక్షించాలని మార్చురీ వద్ద నినాదాలు చేశారు. కేసు నమోదు చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో పోస్టుమార్టం నిర్వహించేందుకు వారు అంగీకరించారు.

ఆహా.. 'అరకు కాఫీ'

అరకు కాఫీకి అంతర్జాతీయంగా క్రేజ్ పెరుగుతోంది. ముఖ్యంగా సేంద్రియ పద్ధతుల్లో సాగుచేస్తున్న కాఫీ ఘుమఘుమలకు విదేశీయులు ఫిదా అవుతున్నారు. ఏజెన్సీలో గిరిపుత్రులు పండిస్తున్న కాఫీని ప్రైవేటు సంస్థలు ప్రస్తుతం ఎగుమతి చేస్తున్నాయి. అయితే.. ఇకపై సొంతంగా ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

- అంతర్జాతీయంగా డిమాండ్
- ఏజెన్సీలో సేంద్రియ పద్ధతుల్లో కాఫీ సాగు
- ఇప్పటికే అరకు కాఫీకి ఎన్‌పీవోపీ ఆర్గానిక్ సర్టిఫికేషన్
- ప్రస్తుతం ప్రైవేట్ సంస్థల ద్వారా విదేశాలకు ఎగుమతి
- సొంతంగా ఎగుమతి చేసేందుకు జీసీసీ ప్రణాళికలు


కాఫీ తోట

సాక్షి, విశాఖపట్నం : అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు ప్రాంతంలో పండే కాఫీకి దేశీయంగానే కాకుండా అంతర్జాతీయంగానూ మొదటి నుంచీ మంచి డిమాండ్ ఉంది. మన కాఫీ బ్రాండ్‌ను అరకు కాఫీ పేరుతో విదేశీ మార్కెట్‌లో మరింత సుస్థిరం చేస్తోంది. జపాన్‌లోనే కాకుండా.. బ్రెజిల్, అమెరికా.. తదితర దేశాల్లో అరకు కాఫీ అంటే ఆహా అనేవారు చాలా మంది ఉన్నారు. అత్యధికంగా కాఫీ తోటలను సాగు చేసే బ్రెజిల్‌తో పాటు మన దేశంలోని కర్ణాటకలో ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్న అరకు కాఫీ.. అంతర్జాతీయ మార్కెట్‌లో తనదైన ముద్రవేసుకుంది. విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో సేంద్రియ పద్ధతుల్లో సాగుచేస్తున్న అరబికా, రోబస్టా చెర్రీ కాఫీ రకాలకు రానురాను మార్కెట్ పెరుగుతోంది. అల్లూరి జిల్లాలో ప్రస్తుతానికి రెండు క్లస్టర్లలో 2,258.55 హెక్టార్ల విస్తీర్ణంలో ఆర్గానిక్ పద్ధతుల్లో కాఫీని పండిస్తున్నారు. చింతపల్లి క్లస్టర్ వరుసగా మూడో ఏడాది నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ఆర్గానిక్ ప్రొడక్షన్ (ఎన్‌పీవోపీ) స్టాండర్డ్స్ సర్టిఫికెట్ తీసుకోగా.. జీకే వీధి క్లస్టర్ ఇప్పటికే రెండుసార్లు స్కోప్ సర్టిఫికెట్ దక్కించుకుంది. మూడో ఏడాదీ సేంద్రియ సాగుకు సంబంధించి స్కోప్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుంది.

సొంతంగా విదేశాలకు ఎగుమతి కోసం...

అరకులో సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న కాఫీ గింజల్ని బెంగళూరుకు చెందిన అనేక ప్రైవేట్ సంస్థలు సేకరిస్తున్నాయి. బ్రెజిల్, జపాన్, యూఎస్‌తో పాటు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. అయితే.. జీసీసీ సొంత బ్రాండ్‌తో దేశీయ మార్కెట్‌లో మాత్రమే కాఫీని విక్రయిస్తోంది. విదేశీ విపణిలో పెరుగుతున్న డిమాండ్‌ని దృష్టిలో పెట్టుకుని ఇకపై సొంతంగా ఎగుమతులు చేపట్టాలని జీసీసీ భావిస్తోంది.

ఎన్‌వోపీ సర్టిఫికెట్ కోసం యత్నం



అల్లూరి జిల్లాలో అద్భుతమైన రుచి కలిగిన ఆర్గానిక్ కాఫీ ఉత్పత్తవుతోంది. ఆర్గానిక్ కాఫీని విదేశాలకు ఎగుమతి చేయాలంటే ప్రస్తుతం ఉన్న ఎన్‌పీవోపీ సర్టిఫికెట్ సరిపోదు. నేషనల్ ఆర్గానిక్ ప్రొడక్షన్ (ఎన్‌వోపీ) స్టాండర్డ్స్ సర్టిఫికెట్ అవసరం. ఇందుకోసం ప్రయత్నిస్తున్నాం.

– సురేష్‌కుమార్, జీసీసీ ఎండీ

ఆర్గానిక్ సాగు పెంచేందుకు కృషి



అరకులో సేంద్రియ కాఫీ సాగును మరింత పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. జీసీసీ నేరుగా విదేశాలకు ఎగుమతి చేస్తే.. ఇక్కడి రైతులు మరింత లాభాలు పొందే అవకాశం ఉంది. పార్చ్‌మెంట్ కాఫీకి కిలోకు రూ.285, చెర్రీకాఫీకి కిలోకు రూ.145 చొప్పున అందిస్తున్నాం.

– శోభా స్వాతిరాణి, జీసీసీ చైర్‌పర్సన్

ఆర్గానిక్ కాఫీ సాగు ఇలా..

చింతపల్లి క్లస్టర్...

గ్రామాలు	సాగు చేస్తున్న రైతులు	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
గొందిపాకల	500	362.50
లంబసింగి	500	334.00
కప్పాలు	300	188.05
మొత్తం	1300	884.55

జీకేవీధి క్లస్టర్‌లో..

గ్రామాలు	సాగు చేస్తున్న రైతులు	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
జీకేవీధి	500	480.00
పెదవలస	500	630.00
యర్రచెరువు	300	264.00
మొత్తం	1300	1374.00

సివిల్స్ సాధనలో సామాజిక స్పృహ కీలకం

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ


ర్యాంకర్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు

దాబాగార్డెన్స్: సమాజంపై అవగాహన ఉంటే సర్వీస్‌లోకి వచ్చాక గొప్పగా సేవ చేయగలుగుతామని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. సివిల్స్ సాధనలో సామాజిక స్పృహ కీలకమన్నారు. మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సివిల్స్‌కు ఎంపికైన అభ్యర్థుల అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ పిల్లలపై సివిల్స్ కోసం తల్లిదండ్రులు ఒత్తిడి చేయడం సరికాదన్నారు. వారి ఇష్టాలను ప్రోత్సహించాలన్నారు. సివిల్స్ సాధనకు ఢిల్లీ, హైదరాబాద్ సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. సరైన మార్గనిర్దేశం ఉంటే ఎక్కడినుంచైనా సిద్ధం కావచ్చన్నారు. సిటీ లా అండ్ ఆర్డర్ డీసీపీ వి.విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ సివిల్స్ ఎంపిక కావాలంటే టాపర్స్ అవ్వాల్సిన పని లేదన్నారు. సాధించాలనే సంకల్పం, కచ్చితమైన ప్రణాళికతో శ్రమిస్తే ఏమైనా సాధించవచ్చన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ యువతకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అన్ని పోటీ పరీక్షలకు కోచింగ్ ఇస్తున్నామని తెలిపారు. అనంతరం 2023 సివిల్స్‌లో విజేతలుగా నిలిచిన విశాఖకు చెందిన 243వ ర్యాంకర్ కె.సాహిత్య, 469వ ర్యాంకర్ బొడ్డు హేమంత్‌ను సన్మానించారు. అనివార్య కారణాలతో కార్యక్రమానికి రాలేకపోయిన 353వ ర్యాంకర్ ఎన్.ఆశ్రిత ఆడియో సందేశం పంపారు. కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం సాంస్కృతిక సమన్వయకర్త జీఎస్ రాజేశ్వరరావు, అల్లూరి స్టడీ సర్కిల్ డైరెక్టర్ అభిమన్యు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశాలకు ఏర్పాట్లు భేష్


వెరిఫికేషన్ సర్టిఫికెట్‌ను బాలికకు అందిస్తున్న డీడీ రామకృష్ణ

మురళీనగర్: పాలిటెక్నిక్ ప్రవేశాలకు నిర్వహిస్తున్న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఏర్పాట్లు బాగున్నాయని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎంఏవీ రామకృష్ణ అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సర్టిఫికెట్ల నమోదుకు సంబంధించిన సందేహాలను సిబ్బందికి నివృత్తి చేశారు. జిల్లాలోని హెల్ప్‌లైన్ కేంద్రాల్లో పాలిటెక్నిక్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరుగుతోందని చెప్పారు. అనంతరం విద్యార్థులకు ఐసీఆర్ వెరిఫికేషన్ సర్టిఫికెట్లను ఆయన అందజేశారు. పాలిసెట్ జిల్లా సమన్వయకర్త కేడీవీ నరసింహారావు పాల్గొన్నారు.

679 మంది హాజరు

కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్), ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో మంగళవారం నిర్వహించిన పాలిటెక్నిక్ కౌన్సెలింగ్‌కు 679 మంది హాజరయ్యారు. కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో 12001–19500 ర్యాంకుల్లో 349 మంది, పాలిటెక్నిక్ కాలేజీలో 19501–27000 ర్యాంకుల్లో 330 మంది పాల్గొని సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకున్నారు. గైస్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, పాలిటెక్నిక్ కాలేజీలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. బుధవారం గైస్‌లో 27001–35000 ర్యాంకులు, పాలిటెక్నిక్ కాలేజీలో 35001–43000 ర్యాంకులు పొందిన విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఎస్టీ విద్యార్థులు పాలిటెక్నిక్ కాలేజీలో హాజరు కావాల్సి ఉంటుంది.

నేవల్ ఆఫీసర్ ఇన్‌చార్జ్‌గా రజ్‌నీష్ బాధ్యతల స్వీకరణ

దొండపర్తి: నేవల్ ఆఫీసర్ ఇన్‌చార్జ్ (ఆంధ్రప్రదేశ్)గా కమడోర్ రజ్‌నీష్ శర్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నేవల్ బేస్‌లో ఇప్పటివరకు ఆ స్థానంలో విధులు నిర్వర్తించిన కమడోర్ ఎం.గోవర్ధన్‌రాజు నుంచి బాధ్యతలు తీసుకున్నారు. రజ్‌నీష్ శర్మ 1997, జూలై 1న నావికాదళంలో చేరారు. నావిగేషన్, డైరెక్షన్‌లో నిపుణుడిగా గుర్తింపు పొందారు. ఐఎన్ఎస్ శివాలిక్‌లో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గాను, ఐఎన్ఎస్ అక్షయ్, ఫ్లీట్ సపోర్ట్ నౌక దీపక్‌కు కమాండర్‌గా వ్యవహరించారు. డిప్యూటేషన్‌పై మారిషస్ నేషనల్ కోస్ట్‌గార్డ్ అధికారిగా విధులు నిర్వర్తించారు.

ముగిసిన క్రీడా శిబిరాలు

విశాఖ స్పోర్ట్స్: ఈకోర్వాల్తేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు మంగళవారంతో ముగిశాయి. రెండునెలల పాటు రైల్వేస్టేడియంలోని ప్రాంగణాల్లో ఈ శిక్షణా శిబిరాలు నిర్వహించారు. బాస్కెట్‌బాల్, బాక్సింగ్, చెస్, టీటీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, వెయిట్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, స్కేటింగ్, మార్షల్‌ఆర్ట్స్‌తో పాటు అథ్లెటిక్స్‌లో శిక్షణనిచ్చారు. ఆయా క్రీడాంశాల్లో శిక్షణ పొందిన వారికి పోటీలు నిర్వహించారు. శిబిరాల ముగింపు కార్యక్రమానికి డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి, ఈకోర్వాల్తేర్ క్రీడాధికారి ప్రవీణ్‌బాటి శిక్షణార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

16 మంది ఇంటర్మీడియట్ విద్యార్థుల డిబార్

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస తిరుమల జూనియర్ కళాశాల కేంద్రంగా సోమవారం మధ్యాహ్నం జరిగిన ఫిజిక్స్–2 పేపర్‌కు సంబంధించి 16 మంది విద్యార్థులను డిబార్ చేశారు. ఈ విషయాన్ని ఇంటర్మీడియట్ అధికారులు, కళాశాల సిబ్బంది గోప్యంగా ఉంచారు. మంగళవారం ఈ విషయం బయటకు పొక్కడంతో అధికారుల్లో హడావుడి మొదలైంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం స్టేట్ అబ్జర్వర్ సోమవారం సాయంత్రం తిరుమల కళాశాల పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి బయటకు వచ్చిన తరువాత సందేహం వచ్చి మళ్లీ తనిఖీలు నిర్వహించగా నలుగురు విద్యార్థులు స్లిప్పులు, పుస్తకాలు చూసి రాస్తున్నారు. వీరు ఇచ్చిన సమాచారం ప్రకారం మరో 12 మంది విద్యార్థులు లోదుస్తుల్లో దాచిన స్లిప్పులు బయటపడ్డాయి. దీంతో వీరందరినీ డిబార్ చేశారు. దీనిపై ఆర్ఐవో పి.ఉమారాణిని వివరణ కోరగా విద్యార్థులు డిబార్ అయిన విషయం వాస్తవమేనన్నారు. డిబార్ అయిన వారిలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఉన్నారన్నారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సామూహిక నిరాహార దీక్షలో పాల్గొన్న ఉద్యోగులు

సీతమ్మధార: రాష్ట్ర ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించాలని ఏపీ జేఏసీ విశాఖ జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ పిలుపు మేరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మంగళవారం ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, గ్రామ/వార్డు, సచివాలయ ఉద్యోగులు సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ 18 రోజులుగా ఉద్యమం చేస్తున్నప్పటికీ.. ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. నెల మొదటి తేదీన ఉద్యోగులకు జీతాలు, పింఛన్‌దారులకు పెన్షన్ అందించాలన్నారు. జేఏసీ సహ చైర్మన్ ఎస్.ఎ.త్రినాథ్ మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలను పెంచాలని కోరారు. జేఏసీ ప్రధాన కార్యదర్శి, ఆర్టీసీ ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ పీఆర్సీ, డీఏ బకాయిలు చెల్లించాలన్నారు. డాక్టర్స్ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు డా.జయదేవ్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. ఏపీఎన్‌జీవో సంఘం సిటీ కార్యదర్శి వి.వి.వి సత్యనారాయణ, ఏపీఆర్ఎస్ఏ జిల్లా కార్యదర్శి సి.హెచ్.వి.రమేష్, ఆర్టీసీ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు కె.ఎస్.ఎస్ మూర్తి, వెటర్నరీ సర్జన్స్ అసోసియేషన్ కార్యదర్శి డా.రాజేష్, క్లాస్–4 ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నమ్మి శ్రీనివాసరావు, కార్యదర్శి నాగయ్య, ప్రభుత్వ డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు వెంకటరావు, పలు ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఏఎస్‌ఐ రమణకు సీపీ నివాళి


ఏఎస్ఐ రమణ మృతదేహం వద్ద సెల్యూట్ చేస్తూ నివాళులు అర్పిస్తున్న సీపీ త్రివిక్రమ వర్మ


అల్లిపురం (విశాఖ దక్షిణ): మహారాణిపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ బీవీ రమణ సోమవారం గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకున్న నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ త్రివిక్రమ వర్మ సంతాపం తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం దరి కృష్ణానగర్‌లోని బీవీ రమణ ఇంటికి వెళ్లి నివాళులు అర్పించారు. అనంతరం ఏఎస్ఐ కుటుంబ సభ్యులను పరామర్శించి, పోలీస్ శాఖ ఎప్పుడు అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.

వుమెన్ బాక్సింగ్ జట్టుకు ఎంపికైంది వీరే..

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి అంతర జిల్లాల జూనియర్ వుమెన్ బాక్సింగ్ జట్టును ఎంపిక చేశారు. ఈ మీట్ జూన్ 9వ తేదీ నుంచి విజయవాడలో జరగనుండగా.. అందులో సత్తాచాటిన వారు భోపాల్‌లో జరిగే జాతీయ మహిళా బాక్సింగ్ పోటీల్లో పాల్గొనున్నారని ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు తెలిపారు. 44 కేజీల వెయిట్ నుంచి 80+కేజీల వెయిట్ వరకు పలు కేటగిరిల్లో పోటీలు నిర్వహించగా విజేతలు రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొనున్నారు. 44–46 కేజీ వెయిట్‌లో హీనాకౌశర్, 46–48లో దేవి చిరంజీవిత, 48–50లో వి.అనిత, 50–52లో కె.నిహారిక విజేతగా నిలిచారు. 52–54లో ఆర్.పల్లవి, 54–57లో ఎస్.మిహిర, 57–60లో సాబా తబస్సుమ్, 60–63లో ఎం.ప్రజ్ఞారాణి, 66–70లో వి.ప్రవల్లిక, 70–75లో జి.నందినిశ్రీ, 80+వెయిట్ కేటగిరిలో ఎస్.హారిక విజేతగా నిలిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు.

కొత్త జిల్లాల్లో దివ్యాంగుల సంక్షేమ కార్యాలయాలు

మందకృష్ణ మాదిగ డిమాండ్


మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

సీతమ్మధార: కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో దివ్యాంగ సంక్షేమ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా దివ్యాంగులకు రూ.3వేల నుంచి రూ.6 వేలకు పింఛన్ పెంచాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం పార్కులో మంగళవారం జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. శారీరక దివ్యాంగులకు రోస్టర్ పాయింట్ టాప్‌టెన్‌లో పెట్టాలన్నారు. దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, తొలగించిన వారికి తిరిగి పింఛన్లు పునరుద్ధరించాలన్నారు. ప్రతీ దివ్యాంగుడికి అంత్యోదయ కార్డు మంజూరు చేయాలని, ఇంటి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. రూ.లక్ష నుంచి రూ.10లక్షల వరకు రుణ సదుపాయం కల్పించాలని కోరారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు చిన్న సుబ్బయ్య యాదవ్, ఎం.రమేష్‌బాబు, వై.డేవిడ్‌రాజు, విశాఖ జిల్లా అధ్యక్షుడు జి.రాము, వి.సుందరరావు, ఎస్.మల్లేశ్వరి, ఉపాధ్యక్షులు దివిరి శ్రీనివాసులు, జె.నాగమణి తదితరులు పాల్గొన్నారు.